# ఇంటిని చక్కదిద్దుకోవడం ఇల్లాలి ప్రథమ కర్తవ్యం

**విశ్వమందు విభుడు వెలుగొందుచుండు**
**విభునియందు విశ్వము వెలుగుచుండు**
**విశ్వవిభుల మైత్రి విడదీయరానిది**
**వినుడు భారతీయ వీరసుతుడ!**

ప్రేమస్వరూపులారా! అనాదికాలమునుండి భారతదేశము అనంతమైన సౌజన్యమును, సౌశీల్యమును ప్రకటిస్తూ వచ్చింది. భారతీయులు అన్యోన్యమైన, అనుకూలమైన, ఆదర్శవంతమైన జీవితాన్ని గడుపుతూ వచ్చారు; ఆధ్యాత్మిక మార్గములో అభివృద్ధి గాంచారు. భారతదేశము ఆధ్యాత్మికమునకు, శీలసంపత్తికి, దానధర్మాలకు పుట్టినిల్లు; శాంతి, సౌభాగ్యములకు మెట్టినిల్లు. సత్యతత్త్వమును ప్రకటించడంలో భారత దేశమునకు సాటి మరొక దేశము లేదు. ఇది శ్రీరాముడు ఏలిన పవిత్రభూమి, శ్రీకృష్ణుడు గీతను బోధించిన పుణ్యభూమి. వ్యాసుడు వేదములను విభజించి ప్రచార ప్రబోధలు సల్పింది ఈ దేశంలోనే. వాల్మీకి రామాయణమును రచించి సత్యధర్మములను ప్రచారము చేసినదికూడా ఈ దేశంలోనే. ఇట్టి పవిత్రమైన దేశమునందు జన్మించి, భారతీయు లనిపించుకొన్నందుకు మీరు భారతీయసంస్కృతిని అభ్యసిస్తూ, అభివృద్ధి చేస్తూ, ఆరాధన చేస్తూ ప్రపంచానికి అందిస్తూ రావాలి. భారతదేశమునందు వీచే గాలి సత్యముతో నిండినది, కాళ్ళ క్రింద లేచే ధూళి ధర్మశీలమైనది. భారతదేశంలో ప్రవహించే గంగ ప్రేమవాహిని. భారతీయులయొక్క ఔన్నత్యముచేత వాళ్ళు ముట్టిన మట్టికూడా మాణిక్యంగా మారుతూ వచ్చింది. భారతీయులు క్షమాహృదయులు. సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలకు నిలయమైనదీ భారతదేశము.

**పరమ పావనమైన భారతావనియందు**
**సహనమన్నదె మనకు చక్కదనము**
**వ్రతములన్నిటియందు వన్నె గాంచినయట్టి**
**ఘన సత్యశీలమే కఠిన తపము**
**మధుర భావంబేది మన దేశమందన్న**
**మాతృభావము కంటె మాన్యమెద్ది?**

భారతదేశమునందు సహనమే మనకు సత్యశీలము, శాంతమే మనకు రక్ష. ఇలాంటి పవిత్రమైన భారతదేశమునందు జన్మించి ఈ దేశసంస్కృతిని మీరు కాపాడుకోలేకపోతున్నారంటే, ఇదెంతటి అవివేకమో మీరే యోచించుకోవచ్చు.

ఈనాటి యువతీయువకులు చదువులు చదవాలి, ఉన్నతవిద్యను అభ్యసించాలి. అయితే, కేవలం ఉద్యోగాల నిమిత్తం చదువరాదు. విద్యయందున్న ఆదర్శమును జగత్తుకు చాటాలి. కాని, విద్యార్థినీ విద్యార్థులు కేవలం

తాత్కాలికమైన అనుకూలముల నిమిత్తమై తమ విద్యను వినియోగిస్తున్నారేగాని, నిత్యసత్యమైనటువంటి భారతీయసంస్కృతిని అనుభవించాలనే ఆశయముతో విద్యను అభ్యసించడం లేదు. ఈ చదువులు చదవడం సమాజానికొక ఆదర్శము నందించడంకోసమనే సత్యాన్ని గుర్తించుకోవడం లేదు. చదువుకొన్నందుకు తాముకూడా ఉద్యోగాలు చేయాలని స్త్రీలు ఒకరితో ఒకరు పోటీ పడుతున్నారు.

**ఉద్యోగములు చేయ సువిదలందరు పోవ**
**ఇంటిలో నుండెడి ఇంతులెవరు?**
**ఆలుమగలిద్దరు ఆఫీసులకు పోవ**
**గృహమును దిద్దెడి గృహిణి ఎవరు?**
**పరబాలురకు నేర్ప పాఠశాలకు పోవ**
**తమ బాలురకు చెప్ప తరుణులెవరు?**
**పుస్తకాల్ చేపట్టి పురుషులవలె పోవ**
**వంట ఇంటిలో చేయు వనిత ఎవరు?**
**డబ్బులేనియట్టి యిబ్బంది తీరిన**
**ఇంటిలోని కొరత ఎట్లు తీరు?**
**సుఖము చూడబోవ శూన్యమేయగు కదా**
**పదవియందునున్న పడతికెపుడు!**

స్త్రీలు ఉద్యోగాలు చేయడంలో తప్పులేదు. కాని, మొట్టమొదట తమ ఇంటిని చక్కదిద్దుకోవాలి. ఇంటి పరిస్థితిని చక్కగా గుర్తించి వర్తించాలి. ఉద్యోగంవల్ల వచ్చే ధనముతో ఆర్థికపరమైన ఇబ్బందులు తీరవచ్చునేమోగాని, ఇంట్లో తల్లి లేకపోవడంవలన పిల్లలు పెడమార్గం పట్టే ప్రమాదమున్నది. మొట్టమొదట మీరు నేర్చిన విద్యను పిల్లలకు బోధించి వారిని అభివృద్ధికి తీసుకురావాలి. అప్పుడే మీ విద్య సార్థక మౌతుంది. వ్యక్తియొక్క నిజమైన శక్తిని నిరూపించే నిమిత్తం ఏర్పడినటువంటిదే విద్య.

### సత్యమార్గాన్ని అనుసరించిన ఆనాటి స్త్రీలు

సత్యహరిశ్చంద్రుని సతియైన చంద్రమతి గొప్ప విద్యావంతురాలు. సత్యంకోసం హరిశ్చంద్రుడు తన సర్వస్వమును త్యాగం చేశాడు. చంద్రమతి తన పతిని అనుసరించింది. కష్టసమయంలో అతను కొంత అధైర్యానికి లోనైనపుడు ఆమె అతనికి తగినరీతిగా ధైర్యం చెబుతూ వచ్చింది. "నాథా! సకలవిద్యాసంపన్నులైన మీరు అధైర్యానికి ఏమాత్రం చోటివ్వకూడదు. మనం సత్యమార్గము ననుసరిస్తూ సంసారసాగరమును ఈదుతున్నాము. సత్యాన్ని గట్టిగా పట్టుకుంటే మనం గట్టుకు చేర గల్గుతాము; లేకపోతే మునిగిపోతాము. ఎలాంటి పరిస్థితిలోనైనా సత్యమే మనల్ని కాపాడుతుంది", అని హితబోధ చేసింది. ఈరీతిగా, ఆనాటి స్త్రీలు తమ పతులకు సత్యమార్గములో నడుచుకోవడానికి తగిన ధైర్యాన్ని అందిస్తూ, భారతీయ సంస్కృతిని పోషిస్తూ వచ్చారు. సీత ఎటువంటి క్లిష్ట పరిస్థితియందైనా అధైర్యానికి తావీయక ఆదర్శవంతమైన జీవితాన్ని గడిపింది. తాను రాక్షసుల చేతిలో చిక్కినప్పటికీ ఏమాత్రం జంకక, క్రుంగక తన పతినే ధ్యానిస్తూ వచ్చింది. దమయంతికూడా గొప్ప ఆదర్శాన్ని అందించింది. ఆమె మహాపతివ్రత. ఆమెయొక్క ధర్మదీక్ష చేతనే నల మహారాజు తాను కోల్పోయిన రాజ్యాన్ని తిరిగి సంపాదించుకోగల్గాడు.

**పిల్లలను ఆదర్శప్రాయులుగా తీర్చిదిద్దాలి**

వనితలు తమ ధర్మమును గుర్తించి వర్తించడానికి భారతీయ చరిత్రలో ఎన్నో ఆదర్శములు కనిపిస్తున్నాయి. ప్రాచీనకాలములో స్త్రీలు గొప్ప సంస్కారమును అభివృద్ధిపరచుకొని, తమ ఇంటిని చక్కదిద్దుకుంటూ, పిల్లలకు తగిన ఆదర్శమును అందించేవారు. కాని, ఈనాడు పిల్లలకు ఆదర్శమునందించే తల్లులు కరవైపోయినారు. డిగ్రీలు తీసుకున్న తక్షణమే స్త్రీలు ఉద్యోగాలకోసం 'అప్లయి' చేస్తున్నారు. ఇంక, పిల్లల గతి ఏమౌతుంది? తల్లులు తమ పిల్లలను ఆదర్శప్రాయులుగా తీర్చిదిద్దినప్పుడే దేశానికి గొప్ప ఉపకారము చేసినవారౌతారు. పిల్లలు పెడమార్గం పడుతుంటే పట్టించు కోకుండా తల్లులు ఉద్యోగాలు చేసి డబ్బు సంపాదిస్తే వచ్చే లాభమేమిటి? మొట్టమొదట ఇంటిని సరిదిద్దుకోవాలి. ఈనాటి విద్యావంతులైన స్త్రీలు ఇంటిపనులు, వంటపనులు చేయడానికి 'వర్కర్స్'ని పెట్టుకుంటారు. తాము సంపాదించే డబ్బు సగం ఆ పనివాళ్ళ జీతాలకే సరిపోతుంది!

**ధనబలం కాదు, గుణబలం ప్రధానం**

ప్రాచీనకాలంలో స్త్రీ, పురుషులు సద్గుణాలను పోషించుకొని, తమ పిల్లలను ఆదర్శప్రాయులుగా తీర్చిదిద్ది మంచిపేరును సంపాదించారు. మీరుకూడా అలాంటి మంచిపేరును సంపాదించాలి. ధనము లేకపోతే నష్టం లేదు. ధనమువల్ల కలిగే సుఖముకంటే గుణమువల్ల కలిగే సుఖమే గొప్పది. ఈనాటి స్త్రీ, పురుషులు కలిమి, చెలిమి, బలిమి – ఈ మూడింటికోసమే పాటుపడుతున్నారు. ఆనాటి స్త్రీ, పురుషులు గుణముకోసం పాటుపడుతూ వచ్చారు. గుణము లేని జీవితము బలము లేని జీవితమే. వ్యక్తియొక్క బలము గుణముపైనే ఆధారపడి ఉందిగాని, ధనముపై కాదు. ఈనాడు గుణవంతులైన స్త్రీ, పురుషులు లేకపోవడంచేతనే పరిస్థితి ఈవిధంగా దిగజారిపోయింది. మనము ఆశించవలసినవి ధనకనక వస్తువాహనాదులు కావు. సద్గుణములను పోషించుకోవాలి. స్త్రీ, పురుషులు గుణవంతులుగా తయారుకావాలి. మన ప్రాచీనులు సత్యానికే స్వాగతం పలికారు, ధర్మానికే పట్టము కట్టారు, ప్రేమతోనే తమ జీవితాన్ని గడిపారు. సత్యంకోసం తమ సర్వస్వమును త్యాగం చేసిన స్త్రీలు ఎందరో మన దేశంలో జన్మించారు.

**గతజీవుడగు పతిన్ బ్రతికించుకున్నట్టి**
**సావిత్రి భారత సతియె కాదె!**
**తన సత్య మహిమచే దావాగ్ని చల్లార్చె**
**చంద్రమతి పవిత్ర పడతి కాదె!**
**కులసతీత్వమునకై గుండాన దూకిన**
**సీత భారత ధరాజాత కాదె!**
**కినిసి దుర్మద కిరాతుని బూది గావించె**
**దమయంతి భారత రమణి కాదె!**
**సప్త సాగర పరివేష్టితోర్వితలము**
**భరత జాతి పాతివ్రత్య ప్రవిమలంబు**
**భావసంపదకిది మహా పంట భూమి**
**అఖిల దేశములకిది ఉపాధ్యాయి కాదె!**

అనాదికాలమునుండి భారతదేశం అన్నిదేశాలకు ఉపాధ్యాయస్థానంలో నిలిచినటువంటిది; ఇది కర్మభూమి, యోగభూమి, త్యాగభూమి అని బిరుదులు సంపాదించినటువంటిది. ఇలాంటి పవిత్రమైన భూమిలో జన్మించిన మీరు సత్కర్మలనాచరించి మీ జీవితాన్ని సార్థకం గావించు కోవాలి. ప్రాచీనకాలంలో భారతీయులకు దేశాభిమానం అధికంగా ఉండేది. తాము మరణించిన తరువాత తిరిగి ఇదే దేశమునందు పుట్టాలని ఆశించేవారు. కాని, ఈనాడు దేశాభిమానము, ధర్మాభిమానము రెండూ క్షీణించిపోయాయి. దేహాభిమానము మితిమీరిపోయింది.

దేహమొక నీటిబుడగవంటిది. దీనిని ఎంతకాలం కాపాడుకోగలరు? ఏదో ఒకనాడిది పుటుక్కున పగిలిపోతుంది. కనుక, దేహాభిమానాన్ని త్యజించి ఆత్మాభిమానమును పెంచుకోవాలి. 'నాయందున్న ఆత్మయే అందరి యందున్నది', అని విశ్వసించాలి. ఆత్మ ఒక్కటే సర్వజీవులను సంరక్షిస్తున్నది. ఆత్మాభిమానము గలవాడే నిజమైన మానవుడు.

**ప్రతి కర్మను చిత్తశుద్ధితో ఆచరించాలి**

మన ప్రాచీనులు ఒక్క క్షణమైనా వ్యర్థం చేసేవారు కారు. కాలమే భగవత్స్వరూపమని భావించి కాలాన్ని సద్వినియోగపరచుకొనేవారు. "కాలాయనమః కాలకాలాయనమః కాలాతీతాయనమః కాలస్వరూపాయ నమః" అని మీరు భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నారు కదా! మరి కాలము భగవత్స్వరూపమనే సత్యాన్ని మీ రెందుకు విస్మరిస్తున్నారు? ఆదివారం వచ్చిందంటే అనేకమంది, 'ఆహా, ఈరోజు హాయిగా ఉండవచ్చు' అని ఆనందిస్తారు. కాని, నిజంగా ఇది ఆనందించవలసిన విషయం కాదు. 'ఛీ, ఆదివారము వచ్చిందంటే నాకు పని లేకుండా పోతున్నదే! ఎంతో కాలము వ్యర్థమైపోతున్నదే!' అని బాధపడాలి. కాలమును సరియైనరీతిగా వినియోగించుకోవాలి. ఏ పనీ లేకపోతే సమాజసేవలో ప్రవేశించాలి. పరోపకారమునకై పాటుపడాలి. దేశసంరక్షణకై మన సర్వస్వమును త్యాగం చేయాలి. ఇదే భారతీయులు నేర్చుకోవలసిన కర్మదీక్ష. భగవద్గీత, "కర్మణ్యేవాధికార స్తే మా ఫలేషు కదాచన" అని బోధించింది. కర్మను సార్థకం చేసుకోవాలి. ప్రతి కర్మను చిత్తశుద్ధితో ఆచరించాలి. చిత్తశుద్ధి లేక చేసిన కర్మలన్నీ వ్యర్థమై పోతాయి. పవిత్రమైన భావముతో ఏ చిన్న కర్మనాచరించినప్పటికీ అదే గొప్ప ఫలమునందిస్తుంది. పవిత్రమైన భావముతో చేసే ప్రతి కర్మకూడా దైవారాధనగానే రూపొందుతుంది. మానవునికి కర్మాచరణ నిమిత్తమై కాయమునందించాడు భగవంతుడు. కాలకర్మకారణములను చక్కగా సమన్వయపరచుకొని తన కర్తవ్యాన్ని నిర్వర్తించడమే మానవునియొక్క ప్రధానధర్మమని భారతీయసంస్కృతి ప్రబోధిస్తోంది.

అనాదికాలమునుండి భారతదేశాన్ని సంరక్షిస్తూ వచ్చింది మన భారతీయసంస్కృతియే. ఇలాంటి పవిత్రమైన సంస్కృతిని ఈనాడు అందరూ విస్మరించారు. సంస్కృతి అంటే *Way of life* అని భావిస్తున్నారు. కాని, ఇది *Way of life* కాదు. జీవితానికి, దేశానికి ఆదర్శాన్ని నిరూపించేది సంస్కృతి. ఈ సంస్కృతిని గురించి ఎంత బోధించినప్పటికీ ఈనాడు వినేవారు లేరు. ఏ కొద్దిమందో విన్నప్పటికీ వారిలో ఆచరించేవారు లేరు. ఆచరించాలని అభిలాష ఉండి తగిన అనుకూలములు లేనివారుకూడా ఎందరో ఉన్నారు.

ప్రేమస్వరూపులారా! ప్రతి సంవత్సరం ఈ 19 నవంబర్‌ను మహిళా దినోత్సవంగా మనం జరుపుకుంటున్నాము. ఏమిటీ మహిళా దినోత్సవం? ఏవో కొన్ని పవిత్రమైన విషయాలు తెలుసుకొని, కొన్ని కార్యక్రమాలు జరుపుకొని, స్వామి ఉపన్యాసం విన్నంతమాత్రాన మహిళాదినోత్సవం జరుపుకున్నట్లవుతుందా? కాదు, కాదు. ముఖ్యంగా మీరు కాలమును సార్థకం గావించుకోవాలి. ఈ 19వ తేదీన చేపట్టే కార్యక్రమాలను మీ జీవితమంతా ఆదర్శంగా నిల్పుకోవాలి. ఆదర్శవంతమైన జీవితాన్ని అభివృద్ధిపరచుకోవాలి. ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవాలి. ఏవిధమైన కష్టనష్టములు ఎదురైనా చలించక ఆత్మగౌరవమును నిల్పుకోవాలి. ఆత్మగౌరవమును కోల్పోయిన తరువాత మనిషి ఉండి ప్రయోజనమేమిటి? ధనం పోయినా ఫరవాలేదు, బలం పోయినా ఫరవాలేదు. కాని, ఆత్మగౌరవాన్ని మాత్రం విడిచిపెట్టకూడదు. అబ్రహాం లింకన్‌కి అతని తల్లి బోధించింది ఇదే. ఆత్మగౌరవాన్ని పోషించుకోవడంచేతనే అతడు అమెరికా దేశానికి అధ్యక్షుడు కాగలిగాడు.

**త్రికరణశుద్ధియే మానవత్వం**

తల్లులు చేసే బోధలు పిల్లలపై చాలా ప్రభావం చూపుతాయి. కనుక, తల్లులు తమ పిల్లలయందు సద్గుణములను, సదాచారములను పెంపొందించాలి. వీటినే మనం సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలని చెబుతున్నాము. వీటిగురించి అందరూ ఉపన్యాసాలిస్తున్నారేగాని, ఎందరు వీటిని ఆచరణలో పెడుతున్నారు? ప్రాచీనకాలంలో మన భారతీయులు ఎలాంటి పరిస్థితియందైనా సత్యము నుల్లంఘించేవారు కారు. "సత్యాన్నాస్తి పరోధర్మః" సత్యముకంటే మించిన ధర్మము లేదు. వేదముకూడా 'సత్యం వద, ధర్మం చర' అని బోధిస్తోంది. మనం తలచేవి, చెప్పేవి, చేసేవి ఒక్కటి కావాలి. ఇదే నిజమైన మానవత్వం. హృదయంలో తలచిన తలంపు, నోటితో పలికిన పలుకు రెండూ క్రియలో వ్యక్తం కావాలి. కాని, ఈనాటి మానవుని ప్రవర్తన ఇందుకు పూర్తి విరుద్ధంగా ఉన్నది. తన మనస్సులోని తలంపులను బయటికి చెప్పడు. తాను చెప్పే పలుకులకు, చేసే పనులకు సంబంధమే లేదు. ఇలాంటి అపవిత్రమైన మార్గములో ప్రవేశించడంచేతనే మానవుని జీవితము వ్యర్థమైపోతున్నది. సత్యము పలుకవలసిన నాలుకతో మానవుడు అసత్యము పలుకుతున్నాడు, పరదూషణకు పాల్పడుతున్నాడు. అలాంటివాని గతి ఏమైపోతుందో చెప్పడానికి వీలుకాదు. సత్యము చాలా విలువైనది. సత్యముచేతనే జీవితము అభివృద్ధికి వస్తుంది. "ఓ పవిత్రమైన నాలుకా! నీవెల్లప్పుడు సత్యమునే పలుకు. ప్రియముగా, హితముగా మాట్లాడు. గోవిందా, దామోదరా, మాధవా... అంటూ భగవన్నామాన్ని ఉచ్చరించు", అని నాలుకకు హితవు చెప్పాలి.

**మాతృమూర్తి ఈశ్వరమ్మ దయాగుణం**

ఈ దేహానికి తల్లియైన ఈశ్వరమ్మ దయార్ద్ర హృదయురాలు. ఆమె అందరినీ ప్రేమతో పలుకరించేది. అందుచేతనే, ఆమెకింతటి పేరు, ప్రఖ్యాతులు వచ్చాయి. ఎవరైనా బాధపడుతుంటే ఆమె చూడలేకపోయేది. నావద్దకు వచ్చి, "స్వామీ! వాళ్ళెవరో చాలా బాధపడుతున్నారు. ఒక్కతూరి పిలిచి మాట్లాడి పంపించండి", అని ప్రాధేయపడేది. "నీవు 'రికమండేషన్' చేయడానికా ఇక్కడికి రావడం?" అంటూ నేను కోపం ప్రదర్శిస్తే, "కాదు స్వామీ, వాళ్ళు చాలా కష్టాలు పడుతున్నారు. ఒక్కతూరి మాట్లాడి పంపించండి", అని వేడుకొనేది. "ఈమె మనస్సులో ఇంతటి దయ, కరుణ ఉంటున్నాయి కదా!" అని నేనెంతో ఆనందించేవాడిని. దయతో కూడినదే హృదయము. కాని, ఈనాటి మానవుడు దయను కోల్పోయి శిలా హృదయునిగా మారిపోతున్నాడు; కఠినమైన మాటలతో ఇతరుల మనస్సును నొప్పిస్తున్నాడు.

ప్రేమస్వరూపులారా! ముఖ్యంగా స్త్రీలు నోటిని కంట్రోలు చేసుకోవాలి. మగవారు బయట ఎన్నో సంస్థలలో తిరుగుతుంటారు కాబట్టి, నోటిని కంట్రోలు చేసుకోవడం వారికి కష్టం కావచ్చు. కాని, స్త్రీలు ఈవిషయంలో తగు జాగ్రత్త వహించాలి. ఇంటి బాధ్యతలు నిర్వర్తించుకుంటూ సరియైన మార్గంలో నడుచుకోవాలి. ఇది స్త్రీలయొక్క ధర్మము. ఇంటికి వచ్చినవారిని గౌరవించాలి. కష్టాల్లో ఉన్నవారికి సహాయం చేయాలి. ఈరోజు వారికి కష్టము కలిగిన కష్టము రేపు మీకుకూడా కలుగవచ్చు. కష్టాలు ఎవరికైనా తప్పవు. కనుక, కష్టాల్లో ఉన్నవారిని ఆదుకొని వారి హృదయాన్ని చల్లబరచాలి. మీరు ఇతరుల మనస్సును ఎంత నొప్పిస్తారో అంతకు రెండింతలు అధికంగా మీరు బాధపడవలసివస్తుంది. ఇతరులను నొప్పించకుండా జీవితాన్ని గడిపినప్పుడే మీరు ధన్యులౌతారు. ఇతరులలో ఉన్న దోషాలను మీరు వ్రేలెత్తి చూపితే, మీలో ఉన్న దోషాలను మూడు వ్రేళ్ళు చూపిస్తాయి. ఈవిషయాన్ని మీరు గుర్తుంచుకోవాలి.

'సత్యం కంఠస్య భూషణం'. కంఠమునకు అలంకారమేమిటి? నెక్లెసు ధరించడం కాదు. కంఠమునుండి సత్యమైన పలుకులు వెలువడాలి. 'హస్తస్య భూషణం దానం', దానమే చేతికి అలంకారం. దానము చేయని

హస్తము వ్యర్థమనే చెప్పవచ్చు. అంతేకాదు. మీ కన్నులు చూసే దృశ్యములెంతో పవిత్రంగా ఉండాలి. కన్నుల్లో కోట్లాది కాంతికిరణా లున్నాయి. సూర్యుని అనుగ్రహంచేతనే కన్నుల్లోని దీప్తులు ప్రకాశవంతంగా ఉంటాయి. కనుకనే, మన ప్రాచీనులు సూర్యనమస్కారము చేసేవారు. "సూర్యాయనమః" అని నమస్కారము చేస్తే ఎంతో గొప్ప ఫలితము లభిస్తుంది. కాని, అపవిత్రమైన దృశ్యాలను చూస్తే మీ కన్నుల్లో ఉన్న శక్తి అంతా వ్యర్థమైపోతుంది. ఇతరులలో ఉన్న దోషాలను చూస్తే మీరు గ్రుడ్డివారైపోతారు. భగవంతుడు ప్రసాదించిన ప్రతి అంగమును మీరు సార్థకం చేసుకోవాలి. ఆ శక్తి మీయందే ఉంటున్నది.

ప్రేమస్వరూపులారా! ఇవన్నీ నిత్యజీవితంలో ఆచరించడానికి చాలా సులభమైనవి. ఇవి సులభమైనవి కదా అని అలక్ష్యం చేయవద్దు. ఈ సులభమైనవే మీకు మోక్షాన్ని చేకూర్చుతాయి. భారతదేశము మీకెంతో గొప్ప ధనమును అందిస్తోంది. ధనమంటే రూపాయల నోట్లు కాదు. విజ్ఞాన, సుజ్ఞాన, ప్రజ్ఞానములనే ధనమును భారతదేశము మీ చేతికి అందిస్తోంది. కాని, దురదృష్టవశాత్తు మీరు దానిని విడిచిపెడుతున్నారు. 'మానవ' అంటే గొప్పశక్తి కల్గినవాడని, పవిత్రమైనవాడని, గొప్ప జ్ఞానమును బోధించే వాడని... ఈవిధంగా ఉపనిషత్తులు అనేక అర్థాలు చెప్పాయి. మీరు మానవులుగా జన్మించారు. కాని, మానవత్వముయొక్క పవిత్రతను గుర్తించుకోలేక తప్పుడు పనులు చేస్తున్నారు. మీ అదృష్టముగాని, దురదృష్టముగాని, మంచిగాని, చెడ్డగాని మీరు చేసే పనులపైనే ఆధారపడి యున్నవి. చేసిన పని ఏనాటికైనా ఫలితాన్నిస్తుంది. కష్టాలను అనుభవించే సమయంలో, 'నేనే పాపం చేశానో', అని వగచి లాభమేమిటి? ముందే జాగ్రత్తపడాలి. కష్టనష్టములకు గురికాకుండా చూసుకోవాలి. దైవము అన్నింటికీ సాక్షీభూతుడు. 'సర్వకర్మ భగవత్ప్రీత్యర్థం' అనే భావముతో మీరు చేసే ప్రతి పనిని దైవార్పితం చేయాలి. అప్పుడే మీరు దైవానుగ్రహానికి పాత్రులు కాగలరు. మీరు సంపాదించవలసినవి లౌకికమైన ధనకనక వస్తువాహనాదులు కావు. సుజ్ఞాన, విజ్ఞాన, ప్రజ్ఞానములే చివరికి మీవెంట వస్తాయి. అట్టి నిత్యసత్యమైన ధనమును మీరు సంపాదించాలి. అప్పుడు దైవబలము ఎల్లప్పుడు మీవెంటనే, జంటనే ఉంటుంది.

ప్రేమస్వరూపులారా! ఈ నవంబరు 19న స్వామిసన్నిధిలో పండుగ జరుపుకోవాలని అనేకమంది మహిళలు ఎంతో ఉత్సాహంగా కాచుకొని ఉన్నారు. అలాంటి పవిత్రమైన భావము కలుగడమే గొప్ప అదృష్టం. మానవత్వం చాలా పవిత్రమైనదని ఉపనిషత్తులు నిరూపించాయి. వేదం మంత్రమయము. ఉపనిషత్తులు జ్ఞానాన్ని బోధిస్తున్నాయి. ఎంత వేదం నేర్చుకున్నప్పటికీ ఉపనిషత్తులే తెలియకుండాపోతే అంతా వ్యర్థమైపోతుంది. మిమ్మల్ని దైవానికి సమీపంగా చేర్చి, దివ్యమైన శక్తిని అందిస్తాయి ఉపనిషత్తులు. అట్టి శక్తిని మీరు సాధించాలని నేను ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

***(తేది: 19.11.2002 సాయంత్రం సాయికుల్వంత్ సభామండపంలో శ్రీవారు అనుగ్రహించిన దివ్య సందేశమునుండి)***